క్లుప్తంగా

29న సీపీఎం మహా సభ

మాక్లూర్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ఈ నెల 29 సీపీఎం రాష్ట్ర మహా సభ నిర్వహించనున్నట్లు సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు, రైతులు, మేధావులు, కార్మికులు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కొండ గంగాధర్, సాయిలు, ఎల్లయ్య, గణేష్, నగేష్, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

2న ఐఎఫ్‌టీయూ మహాసభ



మాక్లూర్: భద్రాద్రి కొత్తగూడెంలో ఏప్రిల్ 2, 3 తేదీల్లో ఐఎఫ్‌టీయూ రెండవ రాష్ట్ర మహా సభలను నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్ తెలిపారు. మండలంలోని మాణిక్‌భండార్‌లో మంగళవారం మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు జరిగే మహా సభలకు జిల్లాలోని అన్ని వర్గాల కార్మికులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నవీన్, సంజీవ్, శివకుమార్, దుర్గా ప్రసాద్, సుమన్, లక్ష్మన్ పాల్గొన్నారు.

సభలను జయప్రదం చేయండి



పెర్కిట్(ఆర్మూర్): నిజామాబాద్‌లో ఏప్రిల్ 2న నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్(జిల్లా సభలు)ను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య రైతు కూలీలకు పిలుపునిచ్చారు. మామిడిపల్లిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు బాబురావు, శివరాజు, గంగారాం, సాయన్న, చరణ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ'ఏ'కి మార్చాలి



రుద్రూర్: ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కోటగిరి డిప్యూటీ తహసీల్దార్ అజీజ్‌కు మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ.. ఉపాధి, ఉద్యోగాల్లో వెనకబడి ఉన్న ముదిరాజ్‌లను డీ గ్రూపు నుంచి ఏ గ్రూపులోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ కార్యదర్శి విఠల్‌గౌడ్, నాయకులు గంగాధర్, సాయిలు, రాజు, మోహన్ హన్మాండ్లు ఉన్నారు.

నర్సరీల పరిశీలన

ఎడపల్లి(బోధన్): మండలంలోని పలు నర్సరీలను మండల ప్రత్యేక అధికారి నందకుమారి మంగళవారం పరిశీలించారు. ఎంపీడీవో గోపాలకృష్ణతో కలిసి ఆమె మండలంలోని జైతాపూర్, ఎంఎస్‌సీ ఫారం, కుర్నాపల్లి, ఎడపల్లి గ్రామాల నర్సరీలను పరిశీలించారు. ఏపీఓ గంగారాం, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బాల్కొండ: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో మహేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఇత్వార్‌పేట్ గ్రామంలో మంగళవారం ఆయన వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉందన్నారు. మొగి పురుగు ఉధృతంగా ఉందన్నారు. ఎకరానికి 4జీ గుళికలు 8కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. లేదా కార్టప్ హైడ్రో క్లోరైడ్ 350 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. నువ్వు పంటలో రసం పీల్చే పురుగులు, వేరుకుళ్లు పురుగుల నివారణ కోసం సూచనలు చేశారు. ఏఈవో కృష్ణవేణి, రైతులు జువ్వన్న, మండల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు

కమ్మర్‌పల్లి: మండలంలోని వివిధ కుల సంఘాల భవన నిర్మాణాల కోసం రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. చౌట్‌పల్లిలోని ఎస్సీ(మాదిగ) సంఘం, కోనాసముందర్‌లో రజక సంఘం, ఉప్లూర్‌లోని ఏకలవ్య సంఘం భవనాలకు రూ.3.50లక్షల చొప్పున నిధులు మంజూరు కాగా.. ప్రొసీడింగ్ కాపీలను టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ మంగళవారం కుల సంఘాల సభ్యులకు అందజేశారు.

'కొనుగోలు కేంద్రం' ప్రారంభం

రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలిలో విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ విజయలక్ష్మీ ప్రారంభించారు. సంఘం డైరెక్టర్లు శ్రీనివాస్ రావ్, భగవాన్ రావ్, మాజీ డైరెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

ఎప్పుడు కూలుతుందో ఏమో?



మెండోరాలోని పశువైద్యశాలలో పెచ్చులూడిన పైకప్పు



కుంగిపోయిన బండలు

- శిథిలావస్థలో మెండోరా పశు వైద్యశాల
- భయాందోళనలో సిబ్బంది

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని పశు వైద్యశాల భవనం ఏ క్షణానా కూలుతుందో అని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పశు వైద్యశాలలో పనిచేసే సిబ్బంది, అధికారులు విధులు నిర్వహించడానికి జంకుతున్నారు. మెండోరా ఉమ్మడి బాల్కొండ మండలంలో ఉన్నప్పుడు గ్రామీణ పశు వైద్యశాలలను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ గ్రామీణ పశు వైద్యశాల భవనం నిర్మించారు. అప్పటి నుంచే భవనం పెచ్చులూడి పోయి వర్షం పడితే ఊరుస్తుంది. కింద ఫ్లోరింగ్ బండలు పూర్తిగా కుంగిపోయి గుంతలు ఏర్పడ్డాయి. అయిన అధికారులెవరూ మరమ్మతులు చేపట్టలేదు.

మండల కేంద్రమైనా మారని పరిస్థితి..

నూతన మండలాల ఏర్పాటులో భాగంగా మెండోరా మండల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రం ఏర్పాటు చేసి ఐదేళ్లు గడిచిన పశు వైద్యశాల నూతన భవనాన్ని నిర్మించలేదు. కనీసం శిథిలావస్థలో ఉన్న భవనం గతి మార్చలేదు. మెండోరా పశు వైద్యశాలలో అసలే వైద్యుడు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానికి తోడు ఆస్పత్రి భవనం కూడ సరిగా లేక పోవడం మరింత ఇబ్బందులకు గురిచేస్తుంది. మండల కేంద్రంలో పశు వైద్య శాల పరిస్థితి ఉండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా పూర్తిస్థాయి వైద్యుడు లేడు. ఇన్‌చార్జి వైద్యుల చేతనే వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం గొల్ల, కుర్మలకు గొర్రెలను సరఫరా చేసింది. వాటి యోగక్షేమాలు పరిశీలించుటకు వైద్యుల అవసరం తప్పకుండ ఉంది. కానీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి మండల కేంద్రంలో వెంటనే పశు వైద్యశాల నూతన భవనాన్ని నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వైద్యుడితోపాటు పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

మెండోరా మండల కేంద్రంలో పశు వైద్యశాల నూతన భవనం నిర్మించుటకు ప్రభుత్వానికి ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. స్థలం రిజిస్ట్రేషన్ కొంత సమస్య ఉందని తెలిసింది. ఉన్నత అధికారులకు నివేదిస్తాం.

– డాక్టర్ గౌతంరాజు, ఇన్‌చార్జి పశు వైద్యాధికారి, మెండోరా

దేశ సంపదను పీఎం దోచేస్తున్నారు





బాల్కొండలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్.. మాక్లూర్‌లో సత్యాగ్రహ దీక్షలో కూర్చున్న కాంగ్రెస్ నేతలు

- మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్
- పలు మండలాల్లో కాంగ్రెస్ నేతల సత్యాగ్రహ దీక్ష

బాల్కొండ: దేశ సంపదను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దోచేసి, తన మిత్రులకు పంచుతున్నాడని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం రాహుల్ గాంధీకి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఆయన పాల్గొని, మాట్లాడారు. దేశంలో పీడిత ప్రజలకు దక్కాల్సిన సంపదను పీఎం దోచి అంబాని, అదానీలకు పెడుతున్నారన్నారు. దీనిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించడంతో అతడి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. అనంతరం పీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, కిసాన్‌ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి , పీసీసీ కార్యదర్శి క్యాతం గంగారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు నీరడి భాగ్య, నాయకులు పాల్గొన్నారు.

మాక్లూర్ మండలంలో..

మాక్లూర్: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు డేగ పోశెట్టి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రాహుల్ గాంధీ అంటే బీజేపీకి భయం ఏర్పడిందని అందుకే కుట్రతో అనర్హత వేటు వేశారన్నారు. నాయకులు గంగాధర్‌గౌడ్, రాజేశ్వర్, జీవన్, పెంట ఇంద్రుడు, సాయిబాబాగౌడ్, కోలా వెంకటేష్, ఎడ్ల పోశెట్టి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి



సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గంగారాం

రుద్రూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రుద్రూర్ విండో సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం సింగిల్ విండో 86వ మహాజన సభ చైర్మన్ సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ... ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రైవేటు వ్యాపారులు కూడా మద్దతు ధర ఇస్తారని అన్నారు. లేదంటే తక్కువ ధరకు విక్రయించాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం సమస్యను ఫోన్లో స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ... సంఘ రుణాలు సకాలంలో చెల్లించి సంఘాభివృద్ధికి సహకరించాలని కోరారు. సంఘ ఆదాయ, వ్యయాలను వివరించారు. ఎంపీపీ సుజాతనాగేందర్, విండో వైస్ చైర్మన్ తొంట శంకర్, డైరక్టర్లు కర్క అశోక్, షేక్ సుభాని, గుర్ల గోపి, ఎముల గజేందర్, చింతం గంగారాం, మలావత్ పీర్యా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చిత్ర కళలో రాణించాలి



ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

బోధన్: ప్రతి విద్యార్థి చిత్ర కళలో రాణించి, గొప్ప చిత్రకారులుగా ఎదగాలని ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. పట్టణంలోని రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో మంగళవారం విద్యార్థులు ఏర్పాటుచేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆర్డీవో ప్రారంభించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలించి అద్భుత ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచిత డ్రాయింగ్ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ముందుకు వస్తే తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాల చిత్రకళ బోధకుడు లింబూరి లక్ష్మణ్‌ను అభినందించారు.

ప్లాట్ల పరిశీలన..

రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలోగల ఇందిరమ్మ కాలనీలో ప్లాట్లను మంగళవారం ఆర్డీవో పరిశీలించారు. గతంలో ఎమ్మెల్యే అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలను అందించేందుకు గ్రామ శివారులోని మూడెకరాల భూమిని కొనుగోలు చేయించారు. స్థలంలో లేఅవుట్ లేకపోవడంతో మంగళవారం తహసీల్దార్, సర్వేయర్‌లతో స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే లేఅవుట్ చేయించాలని తహసీల్దార్‌కు సూచించారు.

ఆధ్యాత్మికం..

'ఆర్టీసీ ద్వారా రాములోరి తలంబ్రాలు'

ఎడపల్లి(బోధన్): టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ ఆధ్వర్యంలో సామాన్య భక్తులకు భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను అందిస్తోందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మాణిక్ రజిత యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బోధన్ డిపో కండక్టర్ రాణి ఆధ్వర్యంలో సీతారాముల తలంబ్రాల బుకింగ్ కేంద్రాన్ని, రజిత యాదవ్ సందర్శించి, మాట్లాడారు. రాములోరి తలంబ్రాలను రూ.116కే ఆర్టీసీ వారు అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామ నవమి ఉత్సవాలు ప్రారంభం



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్, ముప్కాల్ మండలం రెంజర్ల, మెండోరా మండలం పోచంపాడ్‌లో శ్రీరామ నవమి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయాల్లో ధ్వజారోహణ, పుణ్యవచనం, హోమం నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రామాలయంలో రామనవమి ఉత్సవాల కరపత్రాలను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. 30న సీతారాముల కల్యాణం, రథోత్సవం, శుక్రవారం సీతారాములకు పట్టాభిషేక కార్యక్రమం నిర్వహిస్తామని సభ్యులు పేర్కొన్నారు. ఆలయ కమిటి ప్రతినిధులు గంగా మోహన్ చక్రు, గుద్దేటి రమేష్, భగవాన్ దాస్, సుద్దాల శ్రీనివాస్ కొక్కుల లింగం, లింబగిరి స్వామి పాల్గొన్నారు.

హన్మాన్ స్వాముల మండల భిక్ష

రుద్రూర్: పోతంగల్‌లోని హన్మాన్ ఆలయంలో మంగళవారం హన్మాన్ స్వాములు మండల భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు.

ఎంసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ జూనియర్ కళాశాలలో ఏప్రిల్ 3 నుంచి ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్ రాసే విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7780238595, 9490509688, 9059892289ను సంప్రదించాలని సూచించారు.

చెత్తాచెదారాన్ని తొలగించండి



మండలంలోని జీజీ నడ్కుడ గ్రామంలోని మంచినీటి ట్యాంకు వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకవర్గం స్పందించి ట్యాంకు వద్ద చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. – నందిపేట్(ఆర్మూర్)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: కిరణ్ కుమార్, మండల పంచాయతీ అధికారి

ఫోన్ నంబర్ : 95333 64854

చిరు ధాన్యాల్లో పుష్కలంగా పోషకాలు





ఏర్గట్లలో సామూహిక సీమంతాలను నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది.. నీలాలో మాట్లాడుతున్న అధికారులు

మోర్తాడ్: చిరుధాన్యాలతోనే పోషకాలు మెండుగా లభిస్తాయని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి అన్నారు. మంగళవారం ఏర్గట్ల మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్లు, పోషకాలను అందించే పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. భీమ్‌గల్ ప్రాజెక్టు ఏసీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్లు ఉషారాణి, నాగలత పాల్గొన్నారు.

బోధన్: పట్టణంలోని రెంజల్ బేస్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ సీడీపీవో జానకీ పాల్గొని, మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ లలితారాఘవేందర్, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణీలు మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వెల్ బేబీ షో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉన్న పిల్లల్ని ఎంపిక చేసి బహుమతులను అందజేశారు.

మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

ఆర్మూర్‌టౌన్: ప్రతి మహిళ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మంగళవారం ఆమె 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం చిత్రామిశ్రా మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య సమస్యల కోసం ప్రత్యేకంగా ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మహిళలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, డాక్టర్ మానస, ఆరోగ్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం



ఆర్మూర్: పట్టణంలోని 26వ వార్డులో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత ప్రారంభించారు. కౌన్సిలర్ సుజాత రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ ప్రారంభించారు. సర్పంచ్ సుగుణ, ఎంపీటీసీ సత్యనారయణ, ఉప సర్పంచ్ స్రవంతి పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



నవీపేట(బోధన్): మహిళలు బ్యాంకు సేవలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించుకోవాలని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మహంతం గ్రామం స్వయం సహాయక సంఘాలకు మంగళవారం ఆయన ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవీలు, ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ చంద్రకాంత్, ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, మహిళా సంఘం సభ్యులున్నారు.

సమాచారం..

నేడు బార్ ఎన్నికల పోలింగ్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ బుధవారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, విజయలక్ష్మీలు తెలిపారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉదయం 10గంటల నుంచి 3గంటల వరకు పోలింగ్, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. జగదీశ్వర్‌రెడ్డి, కృష్ణంరాజు, దేవన్న, రమేష్, మధు, పవన్ పాల్గొన్నారు.

ముగిసిన తైబజార్ వేలం

ఆర్మూర్ టౌన్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సమక్షంలో ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో తైబజార్ నిర్వహణకు వేలంపాట నిర్వహించారు. ఆర్మూర్, పెర్కిట్, మామిడిపల్లి తైబజార్ నిర్వహణకు ప్రభుత్వం రూ.22లక్షల 16వేల 500లను ప్రారంభ ధరగా నిర్ణయించింది. పట్టణానికి చెందిన ఎస్‌ఆర్ రమేష్ వేలంలో రూ. 25లక్షల 30వేలకు తైబజార్ దక్కించుకున్నాడు. వేలం సమయంలో అధికారులకు, ఒక వ్యాపారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది.

నేడు భీమ్‌గల్‌లో వాహనాలకు..

భీమ్‌గల్: మండలకేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం పలు నేరాలలో స్వాధీనం చేసుకున్న ఐదు వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐపీ వేణుమాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తామని, వేలంలో పాల్గొనదలచిన వారు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాలను తనిఖీ చేసుకొని, పాల్గొనాలని తెలిపారు.

'డబుల్' ఇళ్ల కోసం 439 దరఖాస్తులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో నిర్మించిన రెండు పడకల ఇళ్ల కోసం రెవెన్యూ అధికారులు చేపట్టిన దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ మంగళవారం ముగిసింది. నాలుగు రోజుల్లో కలిపి మొత్తం 439 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 160 ఇళ్లు మంజూరు కాగా, 60 ఇళ్ల నిర్మాణం పూర్తి కావస్తోంది. దరఖాస్తుల విచారణ అనంతరం లక్కీ డ్రా ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించనున్నారు.

సంక్షిప్తం

'ఉత్తమ సర్పంచ్'లకు సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంతో పాటు ఆలూర్ మండలంలో జాతీయ పంచాయతీ అవార్డులు పొందిన సర్పంచ్‌లను మంగళవారం సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

రుద్రూర్: చందూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను సర్పంచ్ బొడ్డోల్ల సత్యనారాయణ పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ కోటగిరి అశ్విని సాయిలు, వార్డు సభ్యులు ఉన్నారు.

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్, కోమన్‌పల్లి గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచులు సొడ ప్రేమలత, పత్రి మంజుల, ఉప సర్పంచ్ సొడ రమేశ్, ఎంపీటీసీ సొడ చందన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 100వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, వీరభద్రప్ప, బానోత్ రమేష్, శంకర్, విద్యార్థి సంఘాల జేఏసీ ప్రతినిధి శివకుమార్‌లు కూర్చున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రెంజల్(బోధన్): మండలంలోని అంబేడ్కర్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ మధురా బాయి ప్రారంభించారు. ఉప సర్పంచ్ మూసా, బీఆర్‌ఎస్ నాయకులు రఫీక్, వసంత్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ తోట జ్యోతి భూమిపూజ చేశారు. ఉప సర్పంచ్ విక్రమ్, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రెంజల్(బోధన్): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జిల్లా రోడ్డు రవాణా శాఖాధికారి దూప్‌సింగ్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

టీబీ నివారణ దినోత్సవం

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో టీబీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని వైద్యసిబ్బంది పిలుపునిచ్చారు. డీపీపీఎం కోర్డినేటర్ సురేశ్, సర్పంచ్ భూదేవి, ఉప సర్పంచ్ కిషన్, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

మాక్లూర్: మందు లేని ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ఉండాలని ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి సరిత అన్నారు. మండలంలోని ఏలియా నాయక్ తండాలో మంగళవారం నిజామాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎన్ఎస్ఎస్ శిబిరం 4వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూఢనమ్మకాలు తదితర అంశాలపై ప్రజలకు వివరించారు.